# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **దేశవ్యాప్తంగా అన్ని రైళ్లలో ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ 'కవచ్' ఏర్పాటు చేస్తున్నామని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంతాన్ని నీటి ప్రాజెక్టుల ద్వారా సస్యశామలంగా మారుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**3.** **రైతు బజార్ల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో నిర్ణీత ధరల్లోనే నిత్యావసర సరుకులను ప్రభుత్వం విక్రయిస్తోందని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి పి నారాయణ తెలిపారు.**

**4.** **తెలంగాణలో కొత్త రేషన్‌కార్డులను జారీ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**

**5.** **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో భవనాల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు ఐఐటీల నిపుణుల బృందం ఈరోజు ఆయా గ్రామాల్లో పర్యటించనుంది.**

**6.** **భారత త్రివర్ణ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య జయంతి ఈరోజు.**

==========================

రైల్వే ప్రమాదాల నివారణకు దేశవ్యాప్తంగా అన్ని రైళ్లలో ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ 'కవచ్' ఏర్పాటు చేస్తున్నామని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. నిన్న లోకసభలో మంత్రి మాట్లాడుతూ, కవచ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. 2024లో కవచ్ వెర్షన్ 4.0కి ఆమోదం లభించిందని 3 వేల కిలోమీటర్ల పొడవున కవచ్ వ్యవస్థ ప్రాజెక్ట్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. వందే భారత్‌లో స్లీపర్ రైళ్లను రైల్వే శాఖ అభివృద్ధి చేస్తోందని తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంతాన్ని నీటి ప్రాజెక్టుల ద్వారా రతనాల సీమగా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర గుండు మలలో ముఖ్యమంత్రి లబ్ధిదారుల ఇంటికి వెళ్లిన ఫించన్ అందజేశారు. గ్రామంలోని కరియమ్మదేవి ఆలయానికి వెళ్లి అమ్మవారిని

దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హంద్రీనీవాలో భాగంగా మడకశిర నియోజకవర్గంలో రాళ్లపల్లి, రత్నగిరి వద్ద రిజర్వాయర్లు నిర్మించి సాగు, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రభుత్వం సామాజిక సమతుల్యాన్ని పాటిస్తుందన్నారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ చేపట్టాలని సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించడాన్ని స్వాగతిస్తున్నట్లు  తెలిపారు. సామాజిక న్యాయం కోసం ఏబీసీడీ వర్గీకరణ విధానం తెచ్చామని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త నగరాన్ని నిర్మించనుందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 57 ఎకరాల్లో 150 కోట్ల వ్యయంతో విశ్వవిద్యాలయం నిర్మించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌ను నిర్మిస్తే.. బెగరికంచను నాలుగో నగరంగా ప్రభుత్వం నిర్మించనుందని చెప్పారు. ఈ ప్రాంతాన్ని వైద్య, క్రీడలు వంటి సంస్థలకు కేంద్రంగా మారుస్తామన్నారు. అనేక పరిశ్రమలను ఏర్పాటు చేసి అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందిస్తామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రైతు బజార్లు, సంస్థాగత విక్రయ దుకాణాల ద్వారా నిర్ణీత ధరల్లోనే నిత్యావసర సరుకులను ప్రభుత్వం విక్రయిస్తోందని రాష్ట్ర పురపాలక,  శాఖామంత్రి పి నారాయణ తెలిపారు. నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ రూపొందించిన  సరసమైన ధరల్లో నాణ్యమైన సరుకులు గోడ పత్రికనును మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రజలపై ధరల ప్రభావం పడకుండా ప్రభుత్వం కిలో కందిపప్పు 150 రూపాయలకు ఉప్పుడు బియ్యం కిలో 48 రూపాయలకు, పచ్చి బియ్యం కిలో 47 రూపాయల చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

---------------------------

తెలంగాణలో కొత్త రేషన్‌కార్డులను జారీ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై పలు  నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. మంత్రి మండలి నిర్ణయాలను తెలంగాణ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాత్రికేయులకు వెల్లడించారు. శాసనసభలో  ఈరోజు జాబ్ క్యాలెండర్ ప్రకటించనున్నామని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల జారీ విధివిధానాల రూపకల్పనకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన మంత్రి వర్గ ఉప కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని తెలిపారు. రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు విడిగా ఇవ్వనున్నామని చెప్పారు. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలోని  సమీప గ్రామాల విలీనానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. నిజాం చక్కెర పరిశ్రమ పునరుద్ధరణకు, హైదరాబాద్‌లో మూసీ సుందరీకరణకు తాము కట్టుబడి ఉన్నామని  మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలోని యువతకు ఉపాధి నైపుణ్యాలు పెంచేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర ఐటి శాఖ  మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర

శాసనసభలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బిల్లును మంత్రి నిన్న ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్నారు. రాబోయే రోజుల్లో దీని ద్వారా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. అలాగే, ముచ్చర్లలో నైపుణ్య విశ్వవిద్యాలయం కోసం శాశ్వత ప్రాంగణాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అన్ని కోర్సులు 50% ఆచరణాత్మక అంశాలను కలిగి ఉంటాయని 2024-25 సంవత్సరంలో 2వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

మానవాళి మనుగడ ప్రకృతిపై ఆధారపడి ఉందనేది కాదనలేని సత్యం. అయితే మనిషి తన అవసరాల కోసం పర్యావరణాన్ని ధ్వంసం చేయడంతో అనేక ప్రకృతి విపత్తులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయవలసిన అవసరం ఉందని పర్యావరణ వేత్తలు చెప్తున్నారు. ఈ క్రమంలో ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రకృతికి ప్రణామం – పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 2019కు ముందు నిర్మాణాలు ప్రారంభించి మధ్యలో నిలిచిపోయిన భవనాల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు మద్రాస్, హైదరాబాద్ ఐఐటీల నిపుణుల బృందం ఈరోజు రాజధాని గ్రామాల్లో పర్యటించనుంది. ఈ రోజు నుంచి రెండురోజుల పాటు నిర్మాణాల పటిష్టత, ఇతర సాంకేతిక అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారని మున్సిపల్ శాఖ మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. సచివాలయం, శాఖా విభాగాధిపతుల కార్యాలయాల టవర్లతో పాటు హైకోర్టు భవనాన్ని మార్గదర్శక కట్టడాలుగా నిర్మించేందుకు మొదలు పెట్టిన పనులు పునాదుల దశలోనే నిలిచిపోయాయని తెలిపింది. ఈ భవనాల సామర్థ్యాన్ని పరిశీలించే బాధ్యతను ఐఐటీ మద్రాస్ నిపుణులకు ప్రభుత్వం అప్పగించింది. అలాగే అఖిల భారత సర్వీసెస్ అధికారుల నివాసాలు, మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాల నాణ్యతను అంచనా వేసే బాధ్యతను హైదరాబాద్ ఐఐటీకి అప్పగించినట్లు మున్సిపల్ శాఖ తెలిపింది.

---------------------------

శ్రీశైలం జలాశయం నుంచి వరద ప్రవాహం కొనసాగడంతో నాగార్జున సాగర్ జలాశయంలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు ఆయకట్టు ద్వారా రైతులకు సాగునీటిని ఈరోజు సాయంత్రం తెలంగాణా ప్రభుత్వం విడుదల చేయనుంది. తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారని దీంతో సల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలోని పంటల సాగుకు సాగునీరు అందుతుందని అధికారులు తెలిపారు.

---------------------------

భారత త్రివర్ణ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య జయంతి ఈరోజు. యావత్ భారతదేశం గౌరవించే జాతీయ జెండాను రూపొందించింది తెలుగు వ్యక్తి కావడం మనకు గర్వకారణం. 1876, ఆగస్టు 2న కృష్ణా జిల్లా భట్ల పెనుమర్రులో ఆయన జన్మించారు. పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని జాతీయ పతాకంగా గుర్తిస్తూ 1921 మార్చి 31, ఏప్రిల్ 1న విజయవాడలో మహాత్మాగాంధీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆ తర్వాత ఆ పతాకానికి కొద్దిగా మార్పులు

చేశారు. గొప్ప దేశభక్తుడు, భూగర్భ శాస్త్రవేత్త, రచయిత అయిన పింగళి వెంకయ్య భారతదేశానికి ఒక జాతీయ పతాకం' అనే పుస్తకాన్ని రచించారు. కార్మిక, కర్షకులపై ఆధారపడిన భారతదేశం, సత్య, అహింసలను ఆచరించడంతో సుభిక్షంగా ఉంటుందనే ఆశయానికి చిహ్నంగా ఆయన రూపొందించిన త్రివర్ణ పతాకం తరతరాలకు తరగని సంపదగా నిలిచింది.

---------------------------

పారిస్ ఒలింపిక్స్ లో భారత్ కు మరో పతకం లభించింది. పురుషుల 50 మీటర్ల ఎయిర్ రైఫిల్ 3 పొజిషన్ విభాగంలో భారత షూటర్ స్వప్నిల్ కుశాలే కాంస్యం పతకం సాధించాడు. ఈ ఒలింపిక్స్‌లో ఇది భారత్ కు మూడో కాంస్యం. ఇప్పటికే మహిళల 10మీ ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, టీమ్ విభాగాలలో మను బాకర్ రెండు కాంస్యాలు సాధించారు. పారిస్ ఒలింపిక్స్ లో దేశానికి పతకం అందించిన స్వప్నిల్ ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందించారు. ఈ విజయం ప్రతి భారతీయుడిలోనూ ఆనందాన్ని నింపిందని పేర్కొన్నారు. ఇలా ఉండగా విలువిద్య, హాకీ, జూడో, అథ్లెటిక్స్, సెయిలింగ్, గోల్ఫ్, షూటింగ్, బ్యాడ్మింటన్ విభాగాల్లో భారతక్రీడాకారులు పోటీపడనున్నారు.

======================